ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
ఆదివారం 27 జూలై 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	581.30 (286.7635)	1,20,339	36,033
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,736.89	1,736.89
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.411 (20.5877)	32,064	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.146 | డ్రెస్ : రూ. 221 | స్కిన్‌లెస్ : రూ.250

ఔషధ దుకాణాల్లో అక్రమాలు



సూర్యాపేటలోని మహాగణపతి ఔషధ దుకాణాన్ని సీజ్ చేసిన మెడికల్ అధికారి నాజియా, పోలీసులు(ఫైల్)

- ఫార్మసిస్టుల పేరుతో దందా
- సూర్యాపేటలో దుకాణంలో స్కానింగ్ సెంటర్ నిర్వహణ
- లింగనిర్ధారణ చేస్తూ పట్టుబడిన వైనం

జిల్లాలో అనుమతులు లేకుండానే ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ఫార్మసిస్టుల పేరుతో అనుమతి తీసుకుంటున్నా, నిర్వహిస్తోంది మాత్రం ఇతరులు. తాజాగా ఔషధ దుకాణంలోనే స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ అధికారులకు పట్టుబడ్డారు. రూ.5 వేలకు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వైద్యాధికారులు సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని ఔషధ దుకాణాలను గుర్తించిన అధికారులు రూ.10 లక్షల వరకు జరిమానా విధించారు. అయినప్పటికీ అనుమతుల్లేని ఔషధ దుకాణాల్లో వ్యాపారాలు కొనసాగుతూనే ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



జిల్లావ్యాప్తంగా 1,0 ఔషధ దుకాణాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్‌లు లేకుండా అనేకమంది ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్నారు. రిటైల్ దుకాణాదారులకు ఫార్మసిస్టు తప్పనిసరిగా ఉండాలి. హోల్‌సెల్ దుకాణాదారులకు అవసరం లేదు. హోల్‌సెల్ దుకాణాలు కూడా 70 నుండి 90 వరకు ఉన్నట్లు సమాచారం. లైసెన్స్‌లు లేకుండా ఔషధాలు విక్రయించే వారిపై ఇప్పటికే 42 కేసులు నమోదుచేశారు. మూడన్నర సంవత్సరాల క్రితం తుంగతుర్తిలో ఎటువంటి డ్రగ్స్ లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న దుకాణా యజమానిపై కూడా కేసు నమోదైంది. పెద్దఎత్తున జరిమానా విధించారు. మొత్తం మీద గత రెండేళ్లలో లైసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహించే వారిపై రూ.10లక్షల వరకు జరిమానా విధించారు. దాదాపు రూ.50లక్షల మందులు సీజ్ చేశారు. ఇదిలా ఉండగా ఔషధ దుకాణదారులు నిషేధిత ఔషధాలు కూడా విక్రయిస్తున్నారు. వైద్యుడు సూచిస్తేనే కానీ విక్రయించవద్దు. అయినా సరే ఆల్ప్రాజోలేన్, డైజోఫాం, కోడైన్ ఫాస్పెట్ వంటి మత్తు వచ్చే మందులను కూడా ఎటువంటి వైద్యుల సూచనలు లేకుండా విక్రయిస్తున్నారు. జిల్లాకు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. ప్రత్యేకంగా సిబ్బంది ఎవరూ లేరు. తరచూ తనిఖీలు చేయాలంటే కూడా ఇబ్బంది ఎదురవుతుందని వైద్యసిబ్బంది తెలిపారు. సిబ్బందిని కూడా పెంచాల్సిన అవసరం ఉందంటున్నారు.

ఔషధ దుకాణమే అడ్డా..

జిల్లాకేంద్రంలోని మహాగణపతి ఔషధ దుకాణంలో లింగనిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నాజియా తనిఖీచేసి లింగనిర్ధారణ స్కానింగ్ యంత్రాన్ని గుర్తించారు. రూ.5 వేలు ఇస్తే కడుపులో ఉన్నది బాబా, పాప చెబుతున్నట్లు వైద్యాధికారుల విచారణలో తేలింది. ఎటువంటి అర్హత లేని వ్యక్తులు

మిగతా 8వ పేజీలో

తరుచూ తనిఖీలు చేస్తున్నాం

మెడికల్ దుకాణాలను తరుచూ తనిఖీలు చేస్తున్నాం. సిబ్బంది తక్కువగా ఉన్నమాట వాస్తవమే. ప్రతీ మెడికల్ దుకాణదారుడు ఫార్మసిస్టులను నియమించుకోవాలి. లేకుంటే కేసులు నమోదు చేస్తాం. రెండేళ్లలో లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నడిపే వారిపై రూ.10లక్షల దాకా జరిమానా విధించాం. జిల్లా కోర్టుల్లో కూడా కేసులు నడుస్తున్నాయి.

సురేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

నిద్రలోనే అనంతలోకాలకు

- చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డీఎస్పీలు మృత్యువాత, ఒక ఏఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు
- మృతులు, క్షతగాత్రులంతా ఏపీ రాష్ట్రవాసులు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం, (ఇన్‌సెట్‌లో) ఈ డివైడర్‌కు ఢీకొట్టడంతో వాహనం ఎగిరిపడింది

ఇంకో గంటలో గమ్యాన్ని చేరుకుంటారనే లోపే మృత్యువు చేరువైంది. విధి నిర్వహణలో అలసిపోయిన వారు, కొంచెం సేపు కునుకు తీద్దామనుకుంటే.. శాశ్వత నిద్ర దగ్గరైంది. దీంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి చెందగా, ఒక ఏఎస్పీ, మరో హెడ్‌కానిస్టేబుల్ గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళుతుండగా, తెల్లవారుజామున 4.45కు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో, ఆ వాహనాన్ని తప్పించబోయి వీరు ప్రమాదం బారిన పడ్డారు.

వివరాలు ప్రధాన సంచికలో..

కేంద్రం నుంచి ఆరు లక్షల
మెట్రిక్‌టన్నుల యూరియా

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి



నేరేడుచర్లలోని పీఏసీఎస్‌లో ఎరువులను నిల్వలను పరిశీలిస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు

నేరేడుచర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజనల్‌లో 7లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించగా ఇప్పటికే ఆరు లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కావాల్సినంత యూరియా రాష్ట్రంలో అందుబాటులో ఉందన్నారు. శనివారం సాయంత్రం నేరేడుచర్ల పీఏసీఎస్, ఎరువుల దుకాణాలను తనిఖీచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 9 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశామన్నారు. కేంద్రం నుంచి ఆరు లక్షల మెట్రిక్ టన్నులు రాగా మరో లక్ష మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్ పరిధిలో 1.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రాష్ట్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో 49,590 సొసైటీల్లో 36వేలు, మార్క్‌ఫెడ్ వద్ద 5,200, కంపెనీ గోదాంలో 2500 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. జూలై నెలలోనే 91వేల మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యిందన్నారు. సూర్యాపేట జిల్లాకు9,800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. కేంద్రం ఇచ్చే యూరియాలో సగం ప్రైవేటు ఫర్టిలైజర్స్ దుకాణాలకు, మిగిలినవి సహకార సంఘాలకు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ జ్యోతి, ఏడీఏ రవి, ఏవో జావిద్, క్లస్టర్ రిజిస్టర్ అధికారి కమల, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందజేయాలి



మొక్క నాటుతున్న డీసీవో పద్మ

సూర్యాపేటరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చూడాలని డీసీవో పద్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి ఎరువుల గోదాంను సందర్శించి ఆమె మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం ఎనిమిది గంటల్లోపే కార్యాలయాలు తెరవాలని సూచించారు. జిల్లాలో ఎంత ఎరువులు అలాట్‌మెంట్ ఉంది రైతులకు ఏ మేరకు విక్రయించారు, ప్రస్తుతం ఎంత అందుబాటులో ఉందనే వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఏసీ అసిస్టెంట్ రిజిస్టర్ అంజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్, వెంకన్న, నవకాంత్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ రద్దు చేసి
టీచర్‌ను రప్పించాలి

సన్నబియ్యం ఇచ్చిన ఘనత
కాంగ్రెస్ ప్రభుత్వానిదే

8లో

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అనితారామచంద్రన్, పక్కన కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ వరదలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. పులిచింతల ముంపుగ్రామాలకు పునరావాసం ఏర్పాటుచేస్తామన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ శివధర్మతేజ మాట్లాడుతూ నాగార్జునసాగర్, మూసీ కాల్వల ద్వారా సాగునీరు అందిస్తున్నామన్నారు. చెరువులు, రిజర్వాయర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. డీఏవో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 6.94లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారి నాజియా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డీఎస్‌వో మోహన్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో 32,274 నూతనంగా రేషన్‌కార్డులు జారీ చేశామన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి శ్రీనివాసరావు, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో పోషకాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి కలెక్టరేట్‌లో మహిళా, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యనందించాలన్నారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకునేలా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ ప్రభుత్వహాస్టళ్లలోని వంటమాస్టర్ల ద్వారా పలురకాల వంటలపై అంగన్‌వాడీకేంద్రాల ఆయాలకు శిక్షణ ఇప్పించి చిన్నారులకు రుచికరమైన భోజనం అందేలా చూస్తామన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారులు దయానంద రాణి, నర్సింహారావు, డీసీపీవో రవి పాల్గొన్నారు.

యూరియా, డీఏపీకి కొరత లేదు

భానుపురి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):యూరియా, డీఏపీకి జిల్లాలో కొరత లేదని, సరిపోను నిల్వలు ఉన్నాయని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేక అధికారి అనితారామచంద్రన్ అన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్‌తో కలిసి సూర్యాపేట పట్టణంలోని మార్కెట్‌లో రుక్మాధర్ ఎరువుల దుకాణాన్ని శనివారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. ఈ-పాస్ మిషన్ ద్వారా నిల్వలు పరిశీలించారు. రైతులు ఏ రకం విత్తనాలు కొనుగోలు చేశారని యజమానిని అడగ్గా సన్నరకం ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. దుకాణంలోని యూరియా, డీఏపీ నిల్వలు పరిశీలించారు. అక్కడికి వచ్చిన ఎడ్లవెల్లి గ్రామానికి చెందిన రైతు భానుతో మాట్లాడారు. ఎన్ని ఎకరాలు ఉంది, ఏ పంట వేశారు, ఎకరానికి ఎంత యూరియా ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు. మూడు ఎకరాల్లో వరి సాగు చేశానని, ఆరు యూరియా బస్తాలు ఉపయోగిస్తామని రైతు భాను తెలిపారు. వారి వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సందీప్, అధికారులు పాల్గొన్నారు.

ఇవేం కూరగాయలు.. తీసేయండి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



కస్తూర్బా పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు(ఎస్), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇవే కూరగాయలు, వెనక్కి పంపించండి అంటూ కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాతో విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. శనివారం మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక, కస్తూర్బా పాఠశాల, అంగన్‌వాడీలను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఉన్నత పాఠశాల గోడలపై చిత్రాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులు ప్రయత్నాలను కలెక్టర్ ప్రశంసించారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠాన్ని చదివించారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. వారికి నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కస్తూర్బా పాఠశాల్లో కూరగాయలను పరిశీలించి బాగాలేకపోవడంతో వెనక్కి పంపించి ప్రిన్సిపాల్ సరస్వతీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి అర్జీలపై ఆరా తీశారు. మొత్తం 3,983 అర్జీలను స్వీకరించామని, 1,810 అర్జీదారులకు నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ కలెక్టర్‌కు వివరించారు. మండల కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనునాయక్, తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపీడీవో మహ్మద్‌హసీం, ఎంఈవో ధారాసింగ్, హెచ్ఎం శ్రవణ్‌కుమార్, వనజ, ఆర్ఐలు ప్రదీప్, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్వేయర్, జీపీవో పరీక్షలు

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే లైసెన్స్ సర్వేయర్లు, జీపీవోల పరీక్షలకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ల ఎంపిక కోసం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు థియరీ పరీక్ష, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 238 మంది హాజరుకానున్నారు. అదే విధంగా గ్రామ పాలనాధికారి పరీక్షకు 80మంది హాజరుకానున్నారు. ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీపీవో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. పరీక్ష నిర్వహణలో ఎక్కడా ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

సర్వేయర్, జీపీవో పరీక్ష నిర్వహించే ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 163 బీఎన్ఎస్ఎస్-2023 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

జిల్లాలో రోజంతా ముసురు



సూర్యాపేటటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం రోజంతా ముసురు కురిసింది. అత్యధికంగా పాలకవీడులో 23.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా సూర్యాపేటలో 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తంగా జిల్లాలో 10.08 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం కురిసింది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. దీంతో పత్తి పంటకు ఎంతో మేలు జరుగుతుంది. అదేవిధంగా వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలో రోజంతా ముసురు పడటంతో ప్రజలు దాదాపు ఇంటికే పరిమితమయ్యారు. వర్షం నీటితో రోడ్లు జలమయమయ్యాయి.


ప్రేమకు ప్రతిరూపాలు తల్లిదండ్రులు

● పిల్లలు బాధ్యతగా ఉంటే అంతా మేలే

● నేడు పేరెంట్స్ డే

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. పిల్లలు వారి ప్రేమకు చిహ్నాలు. వారి జీవిత ఆరాటం, పోరాటం అంతా పిల్లల బాగు, ఉన్నతి కోసమే. వారి ఆస్తిపాస్తులు, కీర్తి ప్రతిష్ఠలు, సామాజిక హోదా పిల్లలకు వారసత్వంగా లభిస్తాయి. తమ కష్టాలు పిల్లలకు రాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు అహోరాత్రులు శ్రమిస్తుంటారు. తమ ఇష్టాలను చంపుకుని జీవిస్తుంటారు. ఏదిచేసినా అంతమంగా పిల్లల కోసమే. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే. అయితే ఇటీవల ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్తున్న పిల్లలు తమ తల్లిదండ్రులను ఆశ్రమాల్లో చేర్పిస్తున్నారు. తమ జీవితాన్ని అంకితం చేసిన తల్లిదండ్రులు జీవిత చరమాంకంలో పిల్లలకు దూరంగా గడపాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)



గతంలో స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభించడం, ఉన్నదాంట్లోనే సర్దుకపోదాం అనే స్వభావంతో తల్లిదండ్రులు, కుమారులు, మనుమలు, మనుమరాళ్లతో ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లేవి. తప్పని పరిస్థితులలో ఒకరిద్దరి పిల్లలు ఇంటికి దూరమైనప్పటికీ కనీసం ఒక్క కుమారుడైనా తల్లిదండ్రులతో ఇంటిపట్టునే ఉండేవారు. ఈ మేరకు తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఎప్పటికప్పుడు అభిప్రాయాల వెల్లడి, సమష్టి నిర్ణయాలతో కష్టసుఖాలను సమపాలలో పంచుకునే వారు. దీంతో తల్లిదండ్రుల వృద్ధాప్య జీవితానికి భద్రత ఉండేది. కానీ నేడు పలు కుటుంబాలలో ఆర్థిక వెసులుబాటు గణనీయంగా పెరిగినప్పటికీ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరవుతున్నారు. ఉద్యోగం, ఉపాధి పేరిట పిల్లలు ఇతర ప్రాంతాలలో, మరికొద్ది మంది విదేశాలలో స్థిరపడటంతో తల్లిదండ్రులు జీవిత చరమాంకంలో వేదనకు గురవుతున్నారు. మరికొద్ది మంది తల్లిదండ్రులకు ఆర్థిక మనుగడ లేక పోవడంతో పిల్లలు వారి వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితులు నెలకొన్నాయి. మరికొన్ని కుటుంబాలలో ఆస్తుల కోసం తల్లిదండ్రులను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఏకంగా హత్య చేస్తున్న పరిస్థితులు నిత్యకృత్యమవుతున్నాయి. అలాగే ఆశ్రమాల్లో చేరుతున్న, పోషణ కోసం ప్రభుత్వ ట్రిబ్యునల్సును ఆశ్రయించాల్సిన పరిస్థితులు క్రమేపీ పెరుగుతున్నాయి. అలాగే పిల్లలకు ఆదర్శకంగా, భరోసాగా ఉండాల్సిన కొద్దిమంది తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతలను విస్మరిస్తూ విలువలు లేని జీవితాలు సాగిస్తుండటంతో ఆ దుష్ప్రభావం పిల్లలపై అంతిమంగా సమాజంపై చూపుతోంది. పిల్లలు పెడదోవ పట్టడానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల వైఖరే ప్రధాన కారణమని వ్యక్తిత్వ వికాస నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ ఆర్థిక సంబంధాల బదులు మానవ సంబంధాలను కొనసాగిస్తే తల్లిదండ్రులు, పిల్లలు ప్రేమ బాధ్యతలతో కూడిన విలువల జీవితాలను సాగించవచ్చునని కుటుంబ సంబంధాల విశ్లేషకులు అంటున్నారు.

బాధ్యతలు తెలియాలి

పిల్లల వృద్ధి, చదువుల కోసం ఓ మోస్తారు దుస్తులను ధరించాలనే, నచ్చిన ఆహారాన్ని కడుపునిండా తినాలనే కనీస కోరికలను కూడా దాచుకుంటూ జీవితాలను త్యాగం చేస్తుంటారు తల్లిదండ్రులు. అలాంటి వారి పట్ల పిల్లలు బాధ్యతాయుతంగా ఉండాలి. వారి కనీస అవసరాలను తప్పనిసరిగా తీర్చాలి. వృద్ధాప్యంలో వైద్యం. పోషణభారాన్ని స్వీకరించాలి. ఈ బాధ్యతలను కుమారులతో పాటు కుమార్తెలు కూడా పంచుకోవాలి. కలసి ఉంటే ప్రతిరోజూ తప్పనిసరిగా పలకరించాలి, ఒకే ఊరిలో వేర్వేరు ప్రాంతాలలో ఉంటే కుటుంబంతో కలిసి వీలున్న ప్రతిసారీ వెళ్లి రావాలి. దూర ప్రాంతాలలో ఉంటే ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా మాట్లాడుతూ మనమల్లు, మనుమరాళ్లను చూపిస్తూ ఆనందాన్ని పంచాలి. వారిని గౌరవిస్తూ, వారి మాటలను ఓపికగా వింటే వారికి పెద్ద ఉపశమనమని పిల్లలు గ్రహించాలని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటిలో జరిగే శుభకార్యాలలో వారికి తప్పనిసరిగా ప్రాధాన్యమివ్వాలని, అదే సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి, భారం పెరగకుండా స్వీయ నియంత్రణ పాటించాలంటున్నారు. ఇలా ఎవరికి వారుగా బాధ్యతగా, ఓర్పుగా ఉంటే అందరికీ మేలే జరుగుతుందంటున్నారు.

మాకు అమ్మనాన్నలే ఆదర్శం..



జంపాల అంజయ్య, వీరలక్ష్మి దంపతులతో కుమార్తెలు

జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన విశ్రాంత వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి జంపాల అంజయ్య, వీరలక్ష్మి దంపతులకు ఐదుగురు కుమార్తెలు. వీరిని ఉన్నత చదువులు చదివించి వివాహం చేశారు. అంజయ్య ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఐదుగురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించేందుకు పలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. అందరూ పీజీ చదివి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. మొదటి కుమార్తె డాక్టర్ నళినికుమారి హైదరాబాద్‌లో, రెండో కుమారి డాక్టర్ ప్రసన్నకుమారి గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా, మూడో కుమార్తె డాక్టర్ సుమనకుమారి హైదరాబాద్‌లో ఎంఎన్‌సీ కంపెనీ బ్రాంచి మేనేజర్‌గా, నాలుగో కుమార్తె డాక్టర్ పావని కుమారి బెంగళూరు రేవా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఐదవ కుమార్తె డాక్టర్ పూర్ణిమకుమారి హైదరాబాద్‌లో శాస్త్రవేత్తగా స్థిరపడ్డారు. అయితే తమ ఉన్నతి కోసం తల్లిదండ్రులు పడిన కష్టాలను ఆ ఐదుగురు కుమార్తెలు నిరంతరం నెమరువేసుకుంటూ ప్రతిరోజూ ఫోన్ ద్వారా పలకరిస్తుంటారు. తాము కూడా తమ పిల్లల పెంపకంలో అమ్మానాన్నలను ఆదర్శంగా తీసుకుంటున్నామని గర్వంగా పేర్కొంటున్నారు.

ఆర్థిక సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్ ఫొటో)

డిండి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ ఆర్థిక సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన జాజుల అనిల్(56) డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. 2022 జూన్ 22న 317 జీవోలో బదిలీపై మండలంలోని రూప్లాబనావత్‌తండాలో విధులలో చేరాడు. విద్యార్థులులేక పాఠశాల మూతపడడంతో కొంతకాలం వీరబోయినపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేశాడు. డిండి ఉన్నత పాఠశాలలో పనిచేసి ఈ విద్యాసంవత్సరం డిప్యూటేషన్‌పై మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత ఐదు రోజులుగా పాఠశాలకు వెళ్లడంలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా అద్దెకు ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. పక్క గదిలో ఉంటున్న మరో ఉపాధ్యాయుడు తన విధులు ముగించుకొని సాయంత్రం 4.30గంటల సమయంలో వచ్చి చూడగా అనిల్ ఉరివేసుకొని ఉండటాన్ని గుర్తించాడు. విషయాన్ని ఎంఈవోకు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

నీటి సంపులో పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

వలిగొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మోటారు పంపుసెట్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ ఓ కాంట్రాక్టు కార్మికుడు నీటిసంపులో పడి మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గుంటూరు జిల్లా బోడిపాలెం గ్రామానికి చెందిన కనికంటి వీరేంద్రచౌదరి(27) రెండేళ్ల నుంచి దివీస్ కంపెనీలో వాటర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం వలిగొండ మండలం జాలుకాల్వ గ్రామశివారులోని దివీస్ కంపెనీ వాటర్‌ప్లాంట్ సంపులోని మోటారు పంపుసెట్‌ను సహోద్యోగులతో కలిసి మరమ్మతులు చేశారు. అనంతరం బయటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ నీటి సంపులో పడి మృతి చెందాడు. వీరేంద్రచౌదరి తండ్రి శ్రీనివాస్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మధుసూదన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

పెద్దవూర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ సమీపంలో శనివారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం హాలియా పట్టణానికి చెందిన నర్మేట మధుసూదన్‌రెడ్డి(55) పెద్దవూరలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ముసలమ్మచెట్టు స్టేజీ సమీపంలోకి రాగా అతను ప్రయాణిస్తున్న బైక్‌ను హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న సిమెంట్ లారీ ఢీకొట్టడంతో మధుసూదన్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మధుసూదన్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మధుసూదన్‌రెడ్డి భార్య పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

బస్టాండ్‌లో మహిళ పర్సు చోరీ

మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు అపహరణ

సూర్యాపేటక్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులో నుంచి పర్సు చోరీకి గురైన సంఘటన శనివారం జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల వద్ద సూర్యాపేటకు వచ్చేందుకు ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కింది. సూర్యాపేట కొత్తబస్టాండ్‌లో బస్సు దిగగానే ఆమె వెంట తెచ్చుకున్న బ్యాగును పరిశీలించగా అందులో పర్సు కనిపించలేదు. పర్సులో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు ఉన్నాయి. బస్సు దిగే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రహించారు. వెంటనే పెట్రోలింగ్ చేసే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధితురాలని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు తెలపడంతో పోలీసులు కొత్తబస్టాండ్ పరిసరాల్లో గాలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పట్టణ పోలీసులు బయటకు తెలపకుండా గోప్యంగా ఉంచుతున్నారు.

దొండపాడు హిమాలయ మద్యం దుకాణం సీజ్



మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

చింతలపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో హిమాలయ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడుగా ఉన్న బీమనబోయిన ప్రవీణ్ హిమాలయ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ దుకాణం నుంచి నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు భావించి పైఅధికారుల ఆదేశాల మేరకు దుకాణ లైసెన్స్‌ను రద్దు చేసి, సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, రుక్మారెడ్డి, ధనుంజయ్, నరేష్ పాల్గొన్నారు.

హైఫై తెలుసా



సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలకేంద్రంలోని పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సందర్శించారు. అక్కడ ఉన్న నాలుగేళ్లలోపు ముగ్గురు చిన్నారులతో సరదాగా ఆడారు. హై ఫై అంటే ఏమిటో తెలుసా అడిగి పిల్లల చేతులతో చప్పట్లు చరుస్తూ కనిపించారు. చిన్నారులు ఏ జంకు లేకుండా సమాధానం చెప్పారు.

● ఆంధ్రజ్యోతి ఆత్మకూరు(ఎస్)

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ఆలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిని యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో పోలీసులు శనివారం అరెస్టుచేశారు. ఎస్‌హెచ్‌వో సీఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కంప విజయ్ ఆలేరు, భువనగిరి, జనగాం ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఇటీవల చోరీ పారిపోయాడు. ఇటీవల ఆలేరు పరిసరాల్లో దొంగల ఆచూకీ కోసం రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం పట్టణంలోని వరంగల్-హైదరాబాద్ జాతీయరహదారిపై ఉన్న చౌదరి దాబా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇరువురిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వాహనానికి సంబంధించిన పేపర్లు చూపకపోవడంతో స్టేషన్‌కు తీసుకవెళ్లారు. తాము వాహనం దొంగిలించిందని పేపర్లు లేవని తెలిపారు. వారు చేసిన చోరీలను అంగీకరిస్తూ వివరాలు ఇచ్చారు. ఆ వివరాలతో చోరీ చేసిన నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా నిందితుడు ద్విచక్రవాహనాలు దొంగిలించి జైలు జీవితం గడిపి విడుదలయ్యాడని సీఐ తెలిపారు. నిందితుడు విజయ్‌ను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితుడు నాలుగుసార్లు జైలుకెళ్లినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వినయ్, ఏఎస్ఐ ఆంజనేయులు, క్రైం పోలీసులు పాల్గొన్నారు.

నేడు సినారే సాహిత్య

పురస్కారాల ప్రదానం

భువనగిరి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సినారే సాహిత్య పురస్కారాలను ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో 11 మంది సాహితీవేత్తలకు ప్రదానం చేస్తున్నట్టు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాలనికి హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా రానున్నట్టు తెలిపారు. సాహితీ ప్రియులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

ఖచ్చితత్వపు లివర్ పరీక్షలకు ఫైబ్రోస్కాన్



బీబీనగర్ ఎయిమ్స్‌లో ఫైబ్రోస్కాన్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న శాంతాసింగ్, ఇతర అధికారులు

బీబీనగర్ ఎయిమ్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఫైబ్రోస్కాన్ అనేది హెపటైటిస్, ఫ్యాటీలివర్, సిరోసిన్ వంటి దీర్ఘకాలిక లివర్ వ్యాధులను తొందరగా, ఖచ్చితంగా గుర్తించడానికి ఫైబ్రోస్కాన్ ఉపయోగపడుతుందని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతాసింగ్ అన్నారు. శనివారం ఎయిమ్స్‌లోని జనరల్ మెడిసన్ విభాగం ఆధ్వర్యంలో ఫైబ్రోస్కాన్ సౌకర్యాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. లివర్ సంబంధిత వ్యాధుల నిర్ధారణలో ఇది ఒక పురోగవంతమైన ఆధునిక సాధనంగా నిలిచిందన్నారు. శరీరాన్ని కోయకుండానే వేగవంతమైన పరీక్షా పద్ధతిగా ఆయన తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలను క్లినికల్ ప్రాక్టీస్‌లో సమర్థంగా ప్రవేశపెట్టడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. పరిశోదన్మాతకపరమైన వైద్యసేవలకు అంకితమవడం సంస్థ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ అశోక్, డాక్టర్ అభిషేక్ ఆరోరా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశాఖ జైన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో

పాడిగేదెలు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడి గేదె వద్ద రైతు ఆంజనేయులు

తుర్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి, ఆత్మకూరు(ఎం) మండలాల్లో శనివారం విద్యుదాఘాతానికి గురై పాడి గేదెలు మృతి చెందాయి. తుర్కపల్లి మండల కేంద్రానికి చెం దిన బిచ్చాల ఆంజనేయులు గేదె మేత కోసం తుర్కపల్లి-కీసర రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతుకు రూ.80వేల నష్టం వాటిల్లింది. పాడి గేదె మృతితో తనకు జీవనోపాధి పోయిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన రైతు దేవినేని వెంకన్న తన వ్యవసాయ బావి వద్ద మేతకోసమని పాడి గేదెను వదిలిపెట్టాడు. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిందని రైతు వెంకన్న తెలిపాడు. సుమారు రూ.60 వేల గేదెను నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పల్లె నుంచి జాతీయస్థాయికి

ఎంపవరింగ్ ఇండియా 2047 జాతీయ స్థాయి సెమినార్ నిర్వహణకు ప్రొఫెసర్ పున్నయ్య




పున్నయ్య రచించిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు(ఫైల్)

మోత్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ ఎ. పున్నయ్య 2047నాటికి భారత దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించేలా అర్థశాస్త్రవేత్తలు, మేధావులతో జాతీయ స్థాయి సెమినార్లు నిర్వహించే స్థాయికి ఎదిగారు. ఆయన ప్రస్తుతం నిజామాబాద్ తెలంగాణ యునివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. 1992లో 178 ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు ఎర్త్ సమ్మిట్ నిర్వహించాయని, ఇందులో ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి లక్ష్యాలు నిర్ధేశించుకోవాలని నిర్ణయించాయని ప్రొఫెసర్ పున్నయ్య తెలిపారు. 2015లో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఉత్పత్తిని పెంచడం, వృథా తగ్గిండం లాంటి 17సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్ధేంచుకు న్నారని తెలిపారు. ఈ దిశలోనే 2047నాటికి భారత దేశం స్వాతంత్ర్య దేశమై వందేళ్లు పూర్తి చేసుకునే నాటికి ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా అంటే ప్రస్తుతం 4 ట్రిలియన్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థను 30ట్రిలియన్లకు పెంచేలా ఎదగాలన్నది లక్ష్యమని వివరించారు. అందుకు చేస్తున్న కృషిలో భాగంగా ప్రధాని మోదీ 2023 డిసెంబరు 11న వికసిత్ భారత్ 2047 ప్రకటించారని, అందుకు సుస్థిర లక్ష్యాలను నిర్ధేశించుకుని, వాటి సాధనకు పలు రకాల వ్యూహాలు రూపొందిస్తున్నారన్నారు.

బ్రోచర్ విడుదల : ఈ నేపథ్యంలో 2047 నాటికి సుస్థిర అభివృద్ధి సాధించడానికి ఏం చేయాలన్న దానిపై డాక్టర్ పున్నయ్య ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక బ్రోచర్ విడుదల చేశారు. దానికి స్పందించి అమెరికా, సౌత్‌కొరియా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలతో పాటు భారత దేశంలోని పది రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు చెందిన 140మంది అర్థశాస్త్రవేత్తల నుంచి సమీక్షలు (పత్రాలు) అందాయి. వాటిపై చర్చించడానికి ఆయన ఆధ్వర్యంలోనే ఈ నెల 23, 24 తేదీల్లో నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో 70 మంది ఆర్థశాస్త్ర వేత్తలు, మేధావులు పత్రాలు సమర్పించారు.


ప్రొఫెసర్ పున్నయ్య నేపథ్యం



ప్రొఫెసర్ పున్నయ్య లక్ష్మీదేవికాల్వ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఎస్ఎస్‌సీ వరకు చిత్తలూరు హైస్కూల్లో, ఇంటర్మీడియట్, డిగ్రీ సూర్యాపేటలో, ఎంఏ ఎకనామిక్స్ ఉస్మానియా యూనివర్సిటీలో చదివి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఎంఫిల్‌లో బంగారు పతకం సాధించారు. పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో చేశారు. 1996లో చింతపల్లి మండలంలో ప్రాథమిక పాఠశాల టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మారుమూల గ్రామం నుంచి వెళ్లి 'ఎంపవరింగ్ ఇండియా 2047 స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించే స్థాయికి ఎదగడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీక్షణం.. ముగ్ధ మనోహరం !!





నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని పెద్ద చెరువులో జలకళ సంతరించుకుంది. పెద్ద చెరువులో నీటి కొంగలు సందడి చేస్తున్నాయి. శనివారం పెద్ద చెరువులోని నీటిలోని విహంగాల సందడి చూపరులను ఆకట్టుకున్నాయి. సూర్యోదయం వేళ భానుడి కిరణాలకోసం నిరీక్షిస్తూ బారులు తీరాయి. చెరువులోని చేపల కోసం కాచుకుని కూర్చున్న తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పెద్ద చెరువు ప్రకృతి దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

●ఆంధ్రజ్యోతి భూదాన్‌పోచంపల్లి.



ఏపూరు ఏటిలో జలకళ

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని ఏపూరు గ్రామ ఏరు జలకళను సంతరించుకుంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఏటి సమీపంలోని పాతర్లపహాడ్, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం, ఏపూరు, బొప్పారం, మిడ్తన పల్లి, మక్తాకొత్తగూడెం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-ఆత్మకూరు(ఎస్)

'స్థానిక' ఎన్నికలపై కాలయాపన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని శాసనసభ, మంత్రి వర్గం ఆమోదించి గవర్నర్‌కు పంపారని గుర్తు చేశారు. బిల్లుపై గవర్నర్ సంతకం చేసి కేంద్రప్రభుత్వానికి పంపినా చట్టం చేయకుండా కేంద్రం కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నా రు. కేంద్రప్రభుత్వం దగ్గరకు రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన బిల్లులను పంపితే వాటిని ఆమోదించకుండా ఏళ్ల తరబడి ఆపుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల గడువు తీరి రెండేళ్లవుతున్నా కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి కేంద్రప్రభుత్వం దగ్గరకు ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్లాలని కోరారు. సకాలంలో ఎన్నికలు నిర్వహించపోవడం వల్ల స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోయాయని అన్నారు ఈ నెల 29వ తేదీన నిర్వహించే మంత్రి వర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డి.మల్లేషం, శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రమీల, సయ్యద్ హా షం, ప్రభావతి, లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో నీటి కష్టాలు



జాతీయ రహదారిని దాటి బకెట్లలో నీళ్లను తీసుకెళ్తున్న విద్యార్థులు

నాగార్జునసాగర్, జూలై 26(ఆంధ్ర జ్యోతి): నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థు లు మూడు రోజులుగా నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల అవరణలో ఉన్న బోరు మోటారు మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు నానాకష్టాలు పడుతున్నారు. దీంతో కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం విద్యార్థులు జాతీయరహదారి 565ను దాటి రోడ్డు వెంట ఉన్న నల్ల వద్ద బక్కెట్లలో నీళ్లను వసతి గృహానికి తీసుకెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నమన్నామని విద్యారులు తెలిపారు. మోటార్లు మరమ్మతుకు గురై మూడు రోజులు గడుస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల వాపోతున్నారు. కొందరు వి ద్యార్థులు రెండు రోజులుగా స్నానాలు కూడా చేయలేదని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఫోన్‌లో వివరణ కోరగా మోటార్లు మరమ్మతుకు గురయ్యాయని వాటిని మరమ్మతులు చేయిస్తున్నామని. 1300 మంది విద్యార్థులు ఉండటంతో నీటి సమస్య రావడం సహజం అని తెలిపారు.

యూరియాపై ఆంక్షలు

● ఎకరాకు ఒక బస్తా మాత్రమే విక్రయం

● రైతు ఆరు ఎకరాలు సాగు చేసినా ఇచ్చేది మూడు బస్తాలే...

● రోజుకు 5 టన్నులు మాత్రమే విక్రయం



తుర్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యూరియా విక్రయాల్లో ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రంలో కేవలం పీఏసీఎస్ కేంద్రంలో మాత్రమే యూరియా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ సాగు పనులు నిలిచిపోయాయి. అదును దాటిపోతుందని, వరినారు ముదిరిపోతుందేమోనని రైతుల్లో ఆందోళన నెలకొన్నది. కానీ నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. యూరియా కోసం రైతులు యూరియా విక్రయ కేంద్రాలకు బాట పట్టారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం యూరియా కొరత లేదని ఓ వైపు పేర్కొంటున్నారు. కానీ యూరియా కోసం వెళ్లిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. గతంలో రైతు ఆధార్ కార్డు చూపిస్తే ఎన్ని సంచులైనా ఇచ్చేవారని రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదేశానుసారమే విక్రయం

ప్రభుత్వ ఆదేశానుసారమే యూరియా విక్రయాలు నిర్వహిస్తున్నాం. ఎకరాకు ఒక సంచే ఇవ్వాలని అధికారులు చెప్పారు. రైతు ఎక్కువ మొత్తంలో సాగు చేస్తే ఒక రశీదుపై మూడు సంచులు ఇస్తున్నాం. అంతకంటే ఎక్కువ కావాలంటే వ్యవసాయాధికారుల అనుమతి తీసుకొని వారి సూచన మేరకు ఇస్తున్నాం

- రమేష్, పీఏసీఎస్ కార్యదర్శి, తుర్కపల్లి

ఎకరాకు ఒక బస్తా

తుర్కపల్లి మండలంలో ప్రస్తుతం రైతులకు ఎకరాకు కేవలం ఒక బస్తా యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాల రైతులు యూరియా కోసం వస్తే ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం జీరాక్స్‌లు ఇస్తేనే ఎకరాకు ఒకటి చొప్పున ఇస్తున్నారు. ప్రస్తుతం యూరియా కోసం వచ్చే రైతులకు మాత్రం ఎకరాకు కేవలం ఒక బస్తా యూరియా సంచి మాత్రమే ఇస్తున్నారు. ఒకవేళ పెద్ద రైతులు ఒకటి కంటే ఎక్కువ ఎకరాల్లో సాగు చేసినా కూడా ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారు. ఆరు ఎకరాలు ఉంటే నాటు పెడితే ఎకరాకు ఒకటి చొప్పున 6 యూరియా సంచులు ఇవ్వాలి. కానీ ఆ రైతుకు మాత్రం మూడు సంచులు వరకు ఇస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులు ఒకేసారి 6 యూరియా సంచులు తీసుకువెళ్లడానికి ఆటోలు తీసుకొని వస్తున్నారు. కానీ ఎకరాకు ఒకటి కంటే ఎక్కువ ఆంక్షలు విధించడంతో ఆటో కిరాయిలు మీద పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు పీఏసీఏఎస్ కేంద్రంలో 5టన్నులు (111 యూరియా సంచులు) మాత్రమే విక్రయిస్తున్నారు. లక్ష్యాన్ని చేరకుంటే మరుసటి రోజు రావాల్సిందేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో అడుగు మందు మాత్రం అసలు దొరకడమే లేదు.

ఆంక్షలు ఎత్తివేయాలి




యూరియా విక్రయానికి పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలి. నాకు 8 ఎకరాల భూమి ఉంది. 6 ఎకరాల్లో వరి సాగు చేశాను. యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రానికి వచ్చాను. కార్యాలయంలో సిబ్బంది తనకు కేవలం మూడు బస్తాలే ఇస్తామన్నారు. మిగతా మూడు ఎకరాల పరిస్థితి ఎలా అని ప్రశ్నించగా మూడు రోజులకు రమ్మని చెప్పారు. దీంతో తన కుటుంబ సభ్యులకు సంబంధించిన పాస్ పుస్తకాలు జీరాక్స్ ఇచ్చి తీసుకోవాల్సి వచ్చింది.

- కల్లూరి వెంకటనర్సింహారెడ్డి, రైతు, వెంకటాపూర్, తుర్కపల్లి

29న సాగర్ గేట్ల ఎత్తివేత?

● 581.30 అడుగులకు చేరుకున్న సాగర్ నీటిమట్టం ● గరిష్ఠ నీటిమట్టానికి మరో తొమ్మిది అడుగుల దూరం



మూసీ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఈనెల 29న ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జున్‌రావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 2007లో జూలైలో ప్రాజెక్టు గేట్లు ఎత్తగా, 18 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఏడాది జూలై నెలలోనే క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. సాగర్‌కు ఈ నీటి సంవత్సరంలో జూన్ 30వ తేదీ నుంచి వరద రాక మొదలైంది. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ఠస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 581.30 అడుగులకు (286.7635టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరే అవకాశం ఉందని ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జున్‌రావు తెలిపారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 511 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం36,033క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 1,20,339 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వలకు ఎటువంటి నీటి విడుదల లేదు.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి వరద నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగర పరిసరాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రెండు, మూడు రోజులుగా ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం ప్రాజెక్టు రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి ఎగువ నుంచి వస్తున్న మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో నిరాటంకంగా కొనసాగుతుండటంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గేట్ల నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి 1736.89 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.50 అడుగులు (4.07టీఎంసీలు) వద్ద నిలకడగా ఉంచుతున్నారు. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడికాల్వకు 263.83 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 215.86 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ ఎగువ నుంచి వసున్న వరద నీటిలో 1184.25 క్యూసెక్కుల నీటిని 3, 8 నెంబరు క్రస్టుగేట్ల ద్వారా దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు.



నిండు కుండలా నాగార్జునసాగర్ జలాశయం

30న డిండి ప్రాజెక్టు నీటి విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు ఈఈ యలమంద

డిండి: డిండి ప్రాజెక్టు నీటిని ఈ నెల 30వ తేదీన ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ యలమంద తెలిపారు. మండల కేంద్రంలోని నీటి పారుదల అతి థిగృహంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 16అడుగుల మేర(0.433 టీఎంసీ) నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఈ వానాకాలం వరి నార్లు పోసుకునేందుకు అదును దాటిపోతుండటంతో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని తూములకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ఆయకట్టులోని 12,500 ఎకరాలకు ఈ నిల్వ ఉన్న నీరు 20రోజులు సరిపోతుందని పేర్కొన్నారు. వర్షాలు కురిసి ప్రాజెక్టులో నీరు చేరుతుందనే ఆశతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



కవచమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు ప్రారంభమయ్యాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్ల ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్థిని సమేతా రామలింగేశ్వర స్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు,నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొన సాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,74,542 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

గుట్ట ఆలయంలో తిరునక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం ఆండాళ్ అమ్మవారికి పూజారులు తిరునక్షత్రోత్సం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి దివ్య ప్రబంద పారాయణాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రచార్యులు, ఏఈవో జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్, నాగుల మహేష్ పాల్గొన్నారు.

4 నుంచి పవిత్రోత్సవాలు

స్వామివారి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో ఆగస్టు 4 నుంచి 6తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా 5 నుంచి 6 తేదీ వరకు రెండురోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహోత్సవం, లక్ష పుష్పార్చన, సుదర్శన నారసింహహో మం రద్దు చేసి తిరిగి 7న పునరుద్ధరించనున్నట్లు వివరించారు.

టెండర్ ఆహ్వానం వివాదాస్పదం

యాదగిరగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శుక్రవారం విడుదల చేసిన టెండరు ప్రకటన వివాదస్పదంగా మారింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలో 'ఇందిర మహిళా శక్తి' పేరుతో క్యాంటిన్ నిర్వహణకు 3 ఏళ్ల కాలపరిమితి రూ. లక్ష డిపాజిట్‌తో టెండరు ఆహ్వానిస్తూ అధికారులు ప్రకటన జారీ చేశారు. కాం గ్రెస్ ఉనికి కోసమే క్షేత్ర పరిధిలో వ్యాపారం పేరుతో ప్రచారం చేస్తోందని బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తక్షణమే టెండరు ప్రకటనను ఉపసంహరించుకోవాలని ఫిర్యాదు చేశారు. 'ఇందిర మహిళా శక్తి క్యాంటీన్' పేరుతో దేవస్థానంలో మహిళ సంఘం సభ్యులు వ్యాపార అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశించినట్లు డీఈవో దోర్బల భాస్కరశర్మ వివరించారు. అభ్యంతరాలు వ్యక్తమవుతున్నందున పునఃపరిశీలనను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి జూలై 26 (ఆంధ్రజ్యోతి): : మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శనివారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత నృసింహుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

● వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్



అరుణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భారత లవకుమార్, నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్క్ చీరల ఉత్పత్తి దారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వీవర్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్‌కుమార్‌ను కలిసి చేనేత సమస్యలపై చర్చించారు. పోచంపల్లి చేనేత పరిశ్రమ అభివృద్ధికి పలు విషయాలపై చర్చించారు. అందుకు సహకరించాల్సిందిగా ఆయన అధికారిని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ వ్యాపారులకు సహకరించాల్సిందిగా కోరారు. చేనేత వాప్యారులతోపాటు కార్మికులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు అయ్యేలా చూ డాలని కోరారు. సమస్యలపై వినతి పత్రాన్ని అందజేయగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. చేనేత సమస్యల పరిష్కారానికి తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, కార్యదర్శి ముసుకూరి నర్సింహ, ఉపాధ్యక్షులు ఈపూరి ముత్యాలు, కుడికాల రామనర్సింహ, కోశాధికారి మంగళపల్లి రమేష్, సహాయ కార్యదర్శి గంజి బాలరాజు, కందగట్ల శంకరయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బెల్లి జనార్దన్

నకిరేకల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని నటుడు, నిర్మాత ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బెల్లి జనార్దన్ సూచించారు. నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రస్మా సహకారంతో శనివారం ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన యువ వికాస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మెలగాలన్నారు. దానివల్ల కలిగే నష్టాలు ఎల్ఈడీ స్క్రీన్‌పై విద్యార్థులకు కళ్ల కు కట్టినట్లు వివరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి, ప్రోగ్రాం చైర్మన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మోహన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ సతీష్‌కుమార్, జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఎన్ రామ్మోహన్‌రావు, మండల విద్యాధికారి నాగయ్య, ట్రస్ట్ కార్యదర్శి యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, క్లబ్ కార్యదర్శి సూర్యచందర్‌రావు, క్లబ్ ప్రతినిధులు గుర్రం అంతయ్య, దైద రవీందర్ పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరుల త్యాగం మరువలేనిది

● ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్



కార్గిల్ అమరులకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, క్యాడెట్లు

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో భారత జవాన్లు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం మరువలేనిదని ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా శనివారం కళాశాలలో కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వార్థ రహితంగా దేశాన్ని రక్షించిన వీర సైనికుల కృషిని గర్వంగా స్మరించుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లలో ఈ భావాజాలాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయనా న్నరు. కార్యక్రమంలో క్యాడెట్లు పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో నేడు సత్సంగం

హుజూర్‌నగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ సత్రంలో ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహిస్తున్నట్లు సేవకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, దాసా నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సత్సంగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు రాంప్రసాద్, శ్రీను, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ



పెన్‌పహాడ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెన్‌పహాడ్ మండల వైద్యాధికారిగా ధరావత్ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మోతె పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తు బదిలీపై పెన్‌పహాడ్ పీహెచ్‌సీకి వచ్చారు. ఎంపీహెచ్‌ఈవోగా టి. వెంకన్న, ఎంపీహెచ్ఎస్‌గా ఎం. వెంకయ్య, ఎంపీహెచ్ఎస్(ఎఫ్)గా పూలమ్మ బాధ్యతలు స్వీకరించారు.

యాదగిరిరెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



ఆర్థిక సాయం అందజేస్తున్న పర్యాటక అభివృద్ధి శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్), జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్కాల యాదగిరిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పర్యాటక అభివృద్ధి శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో యాదగిరిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.1.50లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం యాదగిరిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెలుగు వెంకన్న, షఫీఉల్లా, పిల్లల రమేష్‌నాయుడు, గట్టు శ్రీను, దేవేందర్‌రెడ్డి సైదరెడ్డి, కొంగల జానయ్య, గోపాల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, కోతి ఉపేందర్, మల్సూర్, కర్నాకర్, రమేష్, మహేష్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం'

సూర్యాపేటటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట రమేష్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నేడు హైదరాబాద్‌లో జరిగే సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిడమర్తి అర్జున్, బయ్యా గణేష్, పాల్వాయి ప్రవీణ్, వీరబాబు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈఈ కిరణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేదని, సైడ్ కాల్వలు లేక మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందన్నారు. మురుగు కాల్వల్లో దోమల మందు పిచికారీ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. అండర్ డ్రైనేజీ కోసం తవ్విన గుంతలు సరిగా పూడ్చక పోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు సూరం రేణుక, ఐతరాజుపద్మ, కల్పన, పద్మ, గోగుల వీరబాబు, విజయ్, పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హుజూర్‌నగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్‌నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న సెల్ టవర్‌ను వెంటనే రద్దుచేయాలని వివిధ పార్టీల నాయకులు, కాలనీవాసులు డిమాండ్‌చేశారు. మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్ కాలనీ, తిలక్‌నగర్, హరిజనవాడ, లింగగిరి రోడ్డు ప్రాంతాల్లోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేలా సెల్‌టవర్ నిర్మించడం సరికాదన్నారు. సుమారు పదివేల మంది ప్రజలు సెల్ టవర్‌తో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రేడియేషన్ తీవ్రంగా ఉండి ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కోలపూడి దయాకర్, దగ్గుపాటి బాబూరావు, చంటి, శ్రీనాథ్, కల్యాణ్, నరేష్, సత్యనారాయణ, వసంత్, కమలాకర్, గోపి, నర్సమ్మ, శ్రీను, బిక్షం పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

హుజూర్‌నగర్, జులై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని ఎంఈవో సైదానాయక్ కోరారు. శనివారం మండల పరిధిలోని బూరుగడ్డలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యరగాని నాగరాజు షూలు, బెల్ట్‌లు, బ్యాడ్జీలు, సాక్స్‌లు, నోట్ పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యా ప్రమాణాలను మరింతగా పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ఆర్. శాంత, రేణుక, పద్మ, బాబు, శాంత, సుధాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



రేషన్‌కార్డులు అందజేస్తున్న కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ

అనంతగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేస్తుందని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో రైతు వేదికలో కొత్త రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరూ రేషన్‌కార్డు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డు నిరంతమైన కొనసాగే ప్రక్రియ అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హిమబిందు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆర్‌ఐ వెంకట నగేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, కొండపల్లి వాసు, మాజీ ఎంపీపీ చందూరు వెంకటేశ్వరరావు, కొణతం ఉమా శ్రీనివాసరెడ్డి, ఈదుల కృష్ణయ్య పాల్గొన్నారు.

కోదాడ రూరల్: వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. శనివారం పలు గ్రామాల్లో పర్యటించారు. వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని, పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లబండగూడెం, కూచిపూడి, రెడ్లకుంట, గుడిబండ గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో హంస్సేన్‌ను ఆదేశించారు.

స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

మునగాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని దివ్యాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండంలోని తిమ్మారెడ్డి గూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు 100 శాతం డీఎస్సీ ఉద్యోగాల నియమించాలన్నారు. కార్యక్రమంలో గోపిరెడ్డి మదనమోహన్‌రెడ్డి, కొల్లూరి ఈదయ్య, లాల్‌సింగ్, కృష్ణ, కిషోర్, దుస్సా సతీష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి : సీపీఎం

మునగాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలి సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు డిమాండ్‌చేశారు. మండలంలోని మాధవరంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశగాని వీరబాబు, బచ్చకూరి స్వరాజ్యం, బట్టు నాగయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, వీరస్వామి, జానకిరెడ్డి, నారాయణరెడ్డి, సుందరయ్య, కిషోర్ పాల్గొన్నారు.

వీధుల్లో బురద.. వెళ్లాలంటే అవస్థ



బురదమయమైన సుందరయ్య కాలనీలోని ఓ వీధి

తిరుమలగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చిన్న వర్షానికే వీధులు బురదమయమవుతున్నాయి. తిరుమలగిరిలోని సుందరయ్య కాలనీలో సుమారు 250 నివాస గృహాలు ఉన్నాయి. 15 ఏళ్లుగా కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు వానాకాలంలో అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు, ఇళ్లలోని నీరు, వీధుల్లో ప్రవహిస్తుండంతో వీధులన్నీ బురదమయమవుతున్నాయి. కనీస నడిచే పరిస్థితి లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గతేడాది జూలై 4వ తేదీన సుందరయ్య కాలనీలో తుంగతుర్తి ఎమ్మెల్యే సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.కోటి నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ పనుల్లో పురోగతి లేదు. డ్రైనేజీ పనులుకూడా నత్తనడక సాగుతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. సుందరయ్య కాలనీలోనే కస్తూరిబా పాఠశాల ఉంది. చిన్న వర్షానికి వీధులన్నీ బురదమయం కావడంతో టీచర్లు, సిబ్బంది రోజూ బురదలోనే నడుచుకుంటూ వెళ్తున్నారు. పాఠశాలకు రావాల్సిన వస్తువుల వాహనం కూడా వెళ్లే పరస్థితి లేదు.

వీధులన్నీ బురదమయం

చిన్న వర్షాలకే వీధులన్నీ బురదమయమవుతున్నాయి. బురదలోనే ఇళ్లకు వెళ్తున్నాం. చీకట్లో నడవలేని పరిస్థితి. వాహనాలు దిగబడుతున్నాయి. ఆపద ఉంటే ఒక్క వాహనం కూడా కాలనీలోకి రావడం లేదు.

● ఎర్ర గణేష్

పాఠశాలకు నడిచి వెళ్లలేక పోతున్నాం

పాఠశాలకు బురదలోనే నడుచుకుంటూ వెళ్తున్నాం. కూరగాయల, బియ్యం, ఇతర సరుకుల వాహనాలు పాఠశాల వరకు రావడం లేదు. బురదలో వాహనాలు దిగబడుతున్నాయని డ్రైవర్లు నిరాకరిస్తున్నారు. టీచర్లు, సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో బురదలోనే నడుచుకుంటూ సామగ్రిని పాఠశాలకు చేర్చుకుంటున్నాం.

● ఎస్‌వో సుస్మిత

వర్షపు నీటిలో నడిచి నిరసన

కోదాడరూరల్: వర్షాలకు మండల పరిధిలోని నల్లబండగూడెంలో పీర్ల కొట్టం సెంటర్, ముంద్ర సీతయ్య వీధివాసులు ఇబ్బందులు పడుతున్నారు. వారు శనివారం వర్షపు నీటిలో నడిచి నిరసన తెలిపారు. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో డ్రైనేజీ నీరు వర్షపు నీరు రోజుల తరబడి సీసీరోడ్డు పైన నిలిచిపోవడంతో బురదగా మారి బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన తమ బాధను పట్టించుకోవడం లేదన్నారు. రాత్రి వేళ్లలో వీధిలో నడవాలంటేనే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నల్లబండగూడెంలోని పీర్ల కొట్టంవీధిలో నిండిన వర్షం నీరు

బురదమయంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణ



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బురద

మునగాల: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణ చిత్తడిగా మారింది. నిత్యం వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద నీటిలోంచి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



తిరుమలగిరిలో రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తిరుమలగిరి, జూలై26(ఆంధ్రజ్యోతి): పేదలకు సన్న బియ్యం, రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డుకూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్లలోనే పేదలకు నాణ్యమైన సన్నబియ్యం, రేషన్‌కార్డులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, డీటీ జాన్‌మహ్మద్, ఎంపీడీవో లాజర్, కాంగ్రెస్ నాయకులు పేరాల వీరేష్, జుమ్మిలాల్, కందుకూరి లక్ష్మయ్య, బత్తుల శ్రీను, పత్తెపురం సుధాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని సిద్దిస ముద్రంతండా, జలాల్‌పురం గ్రామాల్లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రాఘవపురంలో గ్రామ పంచాయతీ భవనాన్ని శని వారం ప్రారంభించారు. మారుమూల ప్రాంతాలకు రోడ్లు, గ్రామపంచా యతీ భవనాలు లేని చోట భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ బాబురావు, పంచాయతీరాజ్ ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి సరిత, రాధిక, నాయకులు సుంకరి జనార్దన్, దాచపల్లి వెంకన్న, స్థల దాత కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

మద్దిరాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయేషాపర్వీనా, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, డాక్టర్ అమూల్య, ఏవో అనిషారోహి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, నాయకులు పచ్చిపాల సుమతివెంకన్న, కొమ్ము అంజయ్య, చామకూరి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, వల్లపు రమేష్, తాళ్లపల్లి సురేష్, కంట్లం, అమృతమల్లు, దండె ఉమేష్ పాల్గొన్నారు.

డిప్యుటేషన్ రద్దు చేసి టీచర్‌ను రప్పించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూర్(ఎస్), జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెమ్మికల్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్‌ను డిప్యుటేషన్‌పై కోటినాయక్‌తండా పాఠశాలకు పంపారని డిప్యుటేషన్‌ను యథా స్థానానికి పంపాలని నెమ్మికల్ గ్రామస్థులు కోరారు. శనివారం పాఠశాల ఆవరణలో ప్లకార్డులతో విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ విషయమై డీఈవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జక్కుల నాగరాజు, ఉబ్బని సందీప్, పరిక చంద్రయ్య, గోలి రాజేష్, గోలి సుజాత, పురం అలెగ్జాండర్, చిలుకూరి మమత, నాగెల్లి మానస, పురం శ్రీనివాస్, వీరబోయిన ప్రతాప్, మేకల అనిత పాల్గొన్నారు.

విద్యావేత్త ప్రభాకర్‌రెడ్డి మృతి బాధాకరం

హుజూర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త పటేల్ ప్రభాకర్‌రెడ్డి మృతి బాధాకరమని వివిధ పార్టీల నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని చైతన్య గ్రామర్ స్కూల్ ప్రాంతంలో ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 50ఏళ్ల పాటు విద్యా రంగంగాకి సేవలందించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో ఎండీఆర్ పాఠశాల చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి, యల్లారెడ్డి, గ్రీన్‌వుడ్ స్కూల్ చైర్మన్ మర్రెడ్డి, కాకతీయ స్కూల్ చైర్మన్ కాకి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్‌రావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శీతల రోషపతి, పల్లె వెంకటరెడ్డి, ముల్కలపల్లి సీతయ్య, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు గుండు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

కోదాడ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు తహసీల్దార్, వ్యవసాయాధికారులకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. వానాకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా రైతులకు సరిపడా ఎరువులు సహకార సంఘాల్లో లేకపోవడంతో ప్రైవేటు డీలర్లు రైతులను నిలువునా దోచుకుంటున్నారని వారన్నారు. సహకార సంఘాల్లో రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేవన్నారు. దీంతో ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రూ. 260 ధర ఉన్న యూరియా బస్తాను రూ.350 కు విక్రయిస్తున్నారని తెలిపారు. రూ.1,350 ఉన్న డీఏపీ బస్తాను రూ. 1,450కు విక్రయిస్తున్నారని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్, అన్నెం పాపిరెడ్డి, నర్సిరెడ్డి, అంజిరెడ్డి తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో విజయానికి కృషిచేయాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న జట్టుకొండ సత్యనారాయణ

భానుపురి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి పల్సా మల్సూర్‌గౌడ్ కోరారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పార్టీ పట్టణ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మండల అధ్యక్షుడు అలుగుబెల్లి సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప్పు శ్రీనివాస్, ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షుడు సంధ్యాల సైదులు, వెన్న శశిధర్‌రెడ్డి, మొండికత్తి శివాజీ, జ్యోతుల యుగేందర్ తదితరులు ఉన్నారు. జిల్లా కేంద్రంలో చివ్వెంల మండల బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాధవరపు అనిల్, నెమ్మాది నరేష్, బండపల్లి శ్రీనివాస్, పేర్వాల లక్ష్మణరావు, ధరావత్ శ్రీనివాస్‌నాయక్, రమావత్ మంగ్తానాయక్, జంపాల వెంకన్న ఉన్నారు.

మద్దిరాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో అత్యధిక స్థానాలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్డాణం కిరణ్, నాయకులు భూతం సాగర్, జలగం అచ్చయ్య, గాడుదుల లింగయ్య, విక్రమాచారి, వల్లపు అశోక్, బొమ్మర నరేష్‌గౌడ్, ఎలిమినేటి రాము, లింగరాజు పాల్గొన్నారు.

సత్రం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

మఠంపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రెడ్డి అన్నదాన సత్ర అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మట్టపల్లి రెడ్డి అన్నదాన సత్ర కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మట్టపల్లి మహాక్షేత్రంలో శనివారం రెడ్డి అన్నదాన సత్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు. హుజూర్‌నగర్ మండలం లక్కరం గ్రామానికి చెందిన కొనగంటి వీరారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి కమలమ్మ, కుమారుడు గోపిరెడ్డి స్వప్న దంపతులు సత్రంలో షెడ్ నిర్మాణానికి రూ.50,116ల చెక్కును సత్ర కమిటీ అందజేశారు. కార్యక్రమంలో సౌదారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చిన్నపరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూర్యాపేటలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్

సూర్యాపేటటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ డీఈ సత్యారావు సూచించారు. 100రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని 46వార్డులో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందే అవకాశముందని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసి మునిసిపల్ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, టీపీవో సోమయ్య, రాజురెడ్డి, గౌసుద్దీన్, మనోజ్‌కుమార్, యాదగిరి, శ్వేత, శివప్రసాద్, సరిత, అంగోతు బాబ్‌సింగ్, దంతాల వీరయ్య పాల్గొన్నారు.

నేరేడుచర్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మునిసిపల్ కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా 55వ రోజు శనివారం 9వ వార్డులోని విద్యానగర్‌లో కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, మలేరియా, డెంగీ వ్యాప్తి చెందకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. శాంతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అల్పాహారం వితరణ



అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, జూలై26 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేదలకు శనివారం అల్పాహారం వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గున్‌రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు ఉపయోపడే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగానే సరికొప్పుల నాగేశ్వర్‌రావు ఆర్థిక సాయం అందించగా అల్పాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొణతం సీతారాంరెడ్డి, బట్టుమధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, యూసుఫ్, సూరిబాబు, గుండా సత్యనారాయణ, పూర్ణచంద్రారెడ్డి, చిలకరాజు శ్రీను, ధనుంజయనాయుడు, శావయ్య పాల్గొన్నారు.

ఔషధ దుకాణాల్లో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

స్కానింగ్ కేంద్రాలను నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో అర్హత లేని వైద్యులు నిర్వహిస్తున్న ఆసుపత్రులను సీజ్ చేయడంతో పాటు స్కానింగ్ సెంటర్లను కూడా ఇటీవల సీజ్ చేశారు. అయినప్పటికీ ఏమాత్రం భయం లేకుండా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడంపై సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నుంచి కూడా స్కానింగ్ చేసే నిపుణులు ప్రతి రోజూ లేదా వారంలో మూడు రోజులు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. వీరు పట్టణంలోని చిన్నగదులను అద్దెకు తీసుకొని స్కానింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కొంతమంది ఆర్ఎంపీలు, ఆశావర్కర్ల సహాయంతో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆర్ఎంపీలకు, ఆశావర్కర్‌లకు 10 నుంచి 20శాతం వరకు కమీషన్ ఇస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి ఒక జంట లింగనిర్ధారణ కోసం సూర్యాపేటకు వచ్చింది. ఆర్ఎంపీలు తమ సెల్‌ఫోన్లు వాడకుండా వేరే వ్యక్తుల సెల్‌ఫోన్లు ద్వారా సంభాషిస్తున్నారు. వారు దొరక్కుండా ఎత్తుగడలు వేస్తున్నారు.

నోట్‌బుక్స్‌లు, పెన్నుల పంపిణీ



నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి

పెన్‌పహాడ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని చీదేళ్ల గ్రామ మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి జన్మదినం సందర్భంగా పెన్‌పహాడ్ ప్రభుత్వ పాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్. సునీత, ఉపాధ్యాయులు రాంబాబు, వనజ, బీఆర్ఎస్ నాయకుడు బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దొంగరి యుగేందర్, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, మాజీ కౌన్సిలర్ షేక్ భాషా, సింగిల్‌విండో చైర్మన్ వెన్న సీతారామరెడ్డి, మాజీ ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరావు, నెమ్మాది నగేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.